సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 25 । ఆగస్టు । 2023



వరలక్ష్మీవ్రతంతో సకల శుభాలు

శ్రావణ మాసంలో రెండో శుక్రవారం రోజున జరుపుకునే వరలక్ష్మీవ్రతంతో సకల శుభాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. 8లో



జేపీఎస్‌ల్లో హర్షాతిరేకాలు

జిల్లాలో 100 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించడంతో హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం 31° / 25°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత వాతావరణం కొంత చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

నేడు రామాలయంలో వరలక్ష్మీ వ్రతం



స్వామివారికి హారతి సమర్పిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం శ్రావణ మాసం సందర్భంగా వరలక్ష్మీ వ్రత పూజలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు బేడా మండపంలో సామూహిక కుంకుమార్చన ఉంటుందని, ఈ పూజలో పాల్గొనేందుకు రూ.200 టికెట్‌తో అవకాశం కల్పించామని ఈఓ రమాదేవి తెలిపారు. ఇక, గురువారం స్వామివారికి బేడా మండపంలో నిత్యకల్యాణ వేడుక కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజల అనంతరం స్వామివారిని బేడా మండపంలో వేంచేయింపజేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం స్వామి వారికి కంకణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాధపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీకనకదుర్గమ్మ(పెద్దమ్మతల్లి) ఆలయంలో గురువారం అర్చకులు అమ్మవారికి 108 సువర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. అనంతరం మంత్రపుష్పం, హారతి, నివేదన సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మహిపతి రామలింగం, సభ్యులు గంధం వెంగళరావు, అర్చకులు, వేదపండితులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ పాల్గొన్నారు. కాగా, పెద్దమ్మతల్లిని గోవా ఎమ్మెల్యే సంకల్ప్ అమోన్కర్, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ తదితరులు దర్శించుకున్నారు. వీరి వెంట నాయకులు వీరేంద్రబాబు, వై.శ్రీనివాసకుమార్, ఆకుల నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, కొండం వెంకన్నగౌడ్, రాయల శాంతయ్య, చారి, మల్లికార్జున్, రాంమూర్తి, అంతోటి పాల్ పాల్గొన్నారు.

పోడు పట్టాదారులకు పామాయిల్ మొక్కలు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పోడు సాగుదారులకు అందించిన నేపథ్యాన, ఆయా రైతులకు సబ్సిడీపై ఆయిల్‌పామ్ మొక్కలు సరఫరా చేయనున్నట్లు ఆయిల్‌ఫెడ్ డీఓ ఆకుల బాలకృష్ణ తెలిపారు. అశ్వారావుపేటలోని కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ పోడుపట్టాలు అందుకున్న వారిలో నీటి వసతి ఉండి, రైతుబంధు అందుకున్న రైతులు ఆయిల్ పామ్ మొక్కల కోసం దరఖాస్తు చేస్తే, యాప్‌లో నమోదు చేసి అర్హులకు రూ.20కే మొక్క చొప్పున ఇస్తామని చెప్పారు. అలాగే, గిరిజన రైతులకు వంద శాతం సబ్సిడీపై డ్రిప్ సౌకర్యాన్ని కూడా కల్పించనున్నట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ఎకరానికి రూ.4,200 చొప్పున ప్రభుత్వం మూడేళ్లపాటు ప్రోత్సాహక నగదు అందించనున్న నేపథ్యాన సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఏడాది భద్రాద్రి జిల్లాలో ఎనిమిది లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 4లక్షల ఎకరాలకు 2.28లక్షల మొక్కలు పంపిణీ చేశామని, దాదాపు లక్ష మంది పోడు రైతులకు మొక్కలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని డీఓ వివరించారు.

'గృహలక్ష్మి'కి 37,258 మంది అర్హులు

చుంచుపల్లి: సొంత స్థలం ఉన్న పేదల ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.3 లక్షలు అందించే గృహలక్ష్మి పథకానికి ఈనెల 10వరకు దరఖాస్తులు స్వీకరించగా, అధికారులు వాటి పరిశీలన ప్రక్రియ పూర్తి చేశారు. జిల్లాలోని 23 మండలాలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలో గృహలక్ష్మి పథకానికి 86,773 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 12 నుంచి 20 వరకు అధికారులు క్షేత్రస్థాయిలో వాటిని పరిశీలన చేసి 37,258 మందిని అర్హులుగా గుర్తించారు. వీరిలో తొలివిడత జాబితాపై మరోసారి కసరత్తు చేయనున్నారు. దరఖాస్తులు సమర్పించిన మహిళల పేరిట రేషన్ కార్డులు, అక్కడక్కడా సొంత జాగా లేకపోవడం వంటి కారణాలతో చాలా మందిని తిరస్కరించినట్లు తెలిసింది. తొలి విడతలో నియోజకవర్గానికి మూడు వేల ఇళ్ల చొప్పున మంజూరు చేయనున్నారు.

కమలం వికసించేనా?

బీజేపీ కేడర్‌లో జోష్ నింపేందుకు పొరుగు నేతలు

- నియోజకవర్గాల్లో పర్యటిస్తున్న పార్టీ ప్రతినిధులు
- పది రోజులుగా విస్తృతంగా సభలు, సమావేశాలు
- అమిత్‌షా పర్యటన నేపథ్యంలో ఊపు తెచ్చే యత్నాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా ఉనికి చాటుకోవాలనే తాపత్రయంతో భారతీయ జనతా పార్టీ క్షేత్రస్థాయిలో పని చేసుకెళుతోంది. ఈ మేరకు ఇతర రాష్ట్రాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వారం, పది రోజులుగా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తున్నారు. పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహిస్తూ ఎన్నికల దిశగా కార్యోన్ముఖులను చేస్తున్నారు.

జిల్లాపై నేతల శీతకన్ను..

జిల్లాలో మొత్తం ఐదు అసెంబ్లీ స్థానాలు ఉండగా గత ఎన్నికల సమయంలో భారతీయ జనతా పార్టీకి నిరాశజనకమైన ఫలితాలే ఎదురయ్యాయి. ఏ ఒక్క స్థానంలోనూ గట్టి పోటీ ఇవ్వలేకపోయింది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్యనే ఎన్నికల సమరం జరిగింది. కానీ గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీకి మంచి ఊపు లభించింది. ముఖ్యంగా మొన్నటి వరకు రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్ దూకుడుతో జిల్లాలో పార్టీ పేరు ప్రజల్లోకి బాగా చొచ్చుకుపోయింది. అయితే బండి సంజయ్ మొదలు ప్రస్తుత అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వరకు బీజేపీ అగ్రనాయకులెవరూ ఈ జిల్లాపై పెద్దగా దృష్టి పెట్టలేదు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నిజామాబాద్‌ల్లో చేసినట్టుగా ఇక్కడ పాదయాత్రలు, బహిరంగ సభలు నిర్వహించలేదు. అడపాదడపా వచ్చినా ఖమ్మం వరకే పరిమితమయ్యారు. ఈ జిల్లాలో పార్టీలో జోష్ నింపే కార్యక్రమాలు పెద్దగా జరగలేదనే అభిప్రాయం సర్వత్రా నెలకొంది. ఇక అంతటా అసెంబ్లీ ఎన్నికల వాతావరణం చోటు చేసుకున్న సమయంలో జిల్లా అధ్యక్షుడిగా ఉన్న కోనేరు సత్యనారాయణ (చిన్ని) సైతం పార్టీకి గుడ్‌బై చెప్పారు.

నాలుగు రాష్ట్రాల నుంచి రాక

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో కమలం కేడర్‌లో ఉత్సాహం నింపే బాధ్యతను ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రజాప్రతినిధులకు ఆ పార్టీ అగ్ర నాయకత్వం కట్టబెట్టింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా ఇల్లెందు నియోజకవర్గానికి టి కున్వర్ (మధ్యప్రదేశ్ ఎమ్మెల్యే), పినపాకకు ముఖేశ్ (ఒడిశా ఎమ్మెల్యే), కొత్తగూడెం నియోజకవర్గానికి సంకల్ప్ అమంకర్ (మహారాష్ట్ర ఎమ్మెల్యే), భద్రాచలం నియోజకవర్గంలో ప్రతీక్‌సిన్హా (కర్ణాటక ఎమ్మెల్సీ) గత వారం రోజులుగా పర్యటిస్తున్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల వారీగా ఆశావహులు ఎవరెవరు ఉన్నారు? వారి బలాబలాలు ఏంటనే అంశాలపై బేరీజు వేస్తున్నారు.

27న అమిత్‌షా టూర్

బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈనెల 27న ఖమ్మం పర్యటనకు వస్తున్నారు. దీంతో ఖమ్మంలో ఏర్పాటు చేసే బహిరంగ సభకు జిల్లా నుంచి భారీగా జన సమీకరణ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నియోజకవర్గాల వారీగా సభకు ఎంత మందిని తరలించాలనే అంశంపై ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చారు. అయితే ఇతర జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులకు తోడు తెలుగు రాష్ట్రాలకు చెందిన పార్టీ అగ్రనేతలెవరైనా జిల్లాపై దృష్టి సారిస్తే బాగుంటుందనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో నెలకొంది.

తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయం

కరకగూడెం: వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఒడిశా బీజేపీ ఎమ్మెల్యే ముఖేష్ మహాలింగ్ అన్నారు. ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన మండలంలోని అనంతారంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్టంలో బీఆర్‌ఎస్ అవినీతి, అరాచకాలు పెరిగిపోయాయని, దీంతో ప్రజలు ఆ పార్టీ పట్ల విసుగు చెందారని అన్నారు. కాంగ్రెస్ కూడా రానున్న ఎన్నికల్లో తెలంగాణలో కనుమరుగు కావడం ఖాయమని జోస్యం చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనను చూసి ప్రపంచ దేశాలు అబ్బుర పడుతున్నాయని అన్నారు. తెలంగాణ ప్రజలు కూడా బీజేపీ పాలనను కోరుకుంటున్నారని, పినపాక నియోజకవర్గంలోనూ బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తామని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంగసపల్లి నాగేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి శ్రీరాం చంద్రయ్య, నాయకులు జంపన్న, సీతారామరాజు పాల్గొన్నారు.

ఇల్లెందులో ఆగని వర్గపోరు

- బీఆర్‌ఎస్ పెద్దలు సర్దిచెబుతారట !
- 28న నియోజకవర్గంలో పంచాయితీ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భారత రాష్ట్ర సమితికి ఇల్లెందు నియోజకవర్గంలో వర్గపోరు తలనొప్పిగా మారింది. ఇతర నియోజకవర్గాల్లో అసంతృప్తులు, అసమ్మతులు ఉన్నా కొంత కాలానికి చల్లారాయి. కానీ ఇల్లెందు పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఏడాది గడిచినా పార్టీ నేతల మధ్య పూర్తి స్థాయిలో సఖ్యత కుదరడం లేదు. ఒకరిపై ఒకరు ఫిర్యాదులు, పరస్పర ఆరోపణలతో దూసుకుపోతున్నారు.

28న డిపో ప్రారంభం..

రాబోయే రెండు నెలల్లో ఏ క్షణమైనా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. దీంతో జిల్లా వ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వడివడిగా ప్రభుత్వం అమలు చేస్తోంది. అందులో భాగంగా ఆరు నెలల క్రితమే నిర్మాణం పూర్తయిన ఇల్లెందు బస్‌డిపోను ఈనెల 28న ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అదే రోజు ఇల్లెందు పట్టణంలో మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హాజరవుతారు. ఆయనతో పాటుగా పార్టీలో కీలక నేతలు ఇల్లెందుకు వస్తున్నారు. దీంతో నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులపై సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇల్లెందు మున్సిపాలిటీలో కౌన్సిలర్ల మధ్య నెలకొన్న విభేదాలపై చర్చించడంతో పాటు కామేపల్లి, టేకులపల్లి, గార్ల, బయ్యారం మండలాల్లోని అసమ్మతి నేతలను పిలిచి మాట్లాడతారని తెలుస్తోంది. ఇక టికెట్ దక్కినందున నియోజకవర్గంలోని నేతలందరినీ కలుపుకుపోవాలని ఎమ్మెల్యే హరిప్రియకు కూడా మరోసారి చెబుతారని పార్టీ వర్గాలు అంటున్నాయి.

పోటీ ఖాయమంటున్న అనురాధ

ఇల్లెందు: ఇల్లెందు నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని పలువురు అభిమానులు ఒత్తిడి చేస్తున్నారని, వారి మాట ప్రకారం పోటీ చేయడం ఖాయమని డాక్టర్ గుమ్మడి అనురాధ వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఆమె పేరుతో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. ఐదుసార్లు ఇల్లెందు నుంచి అసెంబ్లీలో అడుగు పెట్టిన ఆదివాసీ నేత గుమ్మడి నర్సయ్య నిజాయితీకి నిలువుటద్దంగా నిలిచారని, ఆయన కుమార్తెనైన తాను ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్నానని, త్వరలో రాజకీయాల్లోకి అడుగు పెడుతున్నానంటూ ఆమె పేరిట పోస్టులు చెక్కర్లు కొడుతున్నాయి. రాజకీయాలను భ్రష్టు పట్టించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న వారి చెర నుంచి నియోజకవర్గాన్ని కాపాడేందుకు వస్తున్నట్లు అందులో పేర్కొన్నారు.

అమిత్‌షా పర్యటన ఖరారు



ఖమ్మంమామిళ్లగూడెం: కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఖమ్మం పర్యటన ఖరారైంది. గురువారం టూర్ షెడ్యూల్ విడుదలైంది. ఈనెల 27న ఉదయం 11 గంటలకు ఢిల్లీ నుంచి విమానంలో బయలుదేరనున్న అమిత్ షా మధ్యాహ్నం 1.25 గంటలకు విజయవాడ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 2.10 గంటలకు భద్రాచలం చేరుకుని శ్రీసీతారామ చంద్రస్వామిని దర్శించుకుంటారు. ఆ తర్వాత హెలికాప్టర్‌లో 3.30 గంటలకు ఖమ్మం చేరుకుని ఎస్‌ఆర్‌అండ్‌బీ జీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సాయంత్రం 5.45 గంటలకు మళ్లీ హెలికాప్టర్‌లో విజయవాడకు బయలుదేరతారు. కాగా, అమిత్ షా పర్యటన ఏర్పాట్లను పరిశీలించేందుకు బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ శుక్రవారం ఖమ్మం వస్తున్నారు.

కోనేరు రాజకీయ భవిష్యత్‌కు కేసీఆర్ భరోసా

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇటీవలి వరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగిన కోనేరు సత్యనారాయణ(చిన్ని) ఆ పార్టీకి రాజీనామా చేసి, బీఆర్‌ఎస్‌లో చేరబోతుండగా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ గురువారం ఆయన ఇంటికి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మధు విలేకరులతో మాట్లాడుతూ.. చిన్ని రాజకీయ భవిష్యత్‌కు సీఎం కేసీఆర్ భరోసా ఇచ్చారని చెప్పారు. చిన్ని తండ్రి కోనేరు నాగేశ్వరరావు టీడీపీలో పని చేసినప్పుడు కేసీఆర్‌కు మిత్రుడని, ఆయన కుమారుడికి సరైన ప్రాధాన్యత ఇస్తారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత జరిగిన ఎన్నికల్లో జిల్లాలో కొత్తగూడెం సీటు మాత్రమే బీఆర్‌ఎస్ గెలిచిందని గుర్తు చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో నేడు దేశానికే తెలంగాణ రోల్‌మోడల్‌గా నిలిచిందన్నారు. వ్యవసాయ, ఆర్థిక, ఐటీ తదితర రంగాల్లో అగ్రభాగాన ఉన్నామని చెప్పారు. ప్రధాని మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో కూడా తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి కనిపించదని అన్నారు. కేంద్రప్రభుత్వం నుంచి అవార్డులు రావడమే తెలంగాణ అభివృద్ధికి నిదర్శనమని చెప్పారు. కోనేరు సత్యనారాయణను సాదరంగా పార్టీలోకి ఆహ్వానిస్తున్నామని, అందరం సమష్టిగా పనిచేసి, కొత్తగూడెంలో బీఆర్‌ఎస్‌ను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో కోనేరు సత్యనారాయణ, రవిచంద్ర, మేడిద సంతోష్, రావి రాంబాబు, కోనేరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పిన్ జనరేట్ చేయమంటే డబ్బులు కాజేశాడు !

చర్ల: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో పని చేస్తున్న ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి పిన్ జనరేట్ చేయాలని కోరిన ఖాతాదారుడి ఏటీఎం కార్డు నుంచి రూ.9 వేలు కాజేసిన ఘటన గురువారం వెలుగుచూసింది. మండలంలోని దేవరాపల్లి గ్రామానికి చెందిన తెల్లం శంకర్‌రావుకు ఎస్‌బీఐలో ఖాతా ఉండగా, పాత ఏటీఎం కార్డు గడువు ముగియడంతో కొత్త కార్డు తీసుకున్నాడు. ఏటీఎం మిషన్‌లో పిన్ జనరేట్ చేయించుకునేందుకు శంకర్‌రావు ఈనెల 21న బ్యాంక్‌కు వచ్చాడు. ఈ క్రమంలో ఎస్‌బీఐలో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగి సాయం కోరాడు. దీంతో పిన్ జనరేట్ చేసిన ఉద్యోగి.. ఏటీఎం కార్డు ద్వారా రూ. 2 వేలు డ్రా చేసి శంకర్‌రావుకు ఇచ్చాడు. ఆ తర్వాత ఏటీఎం కార్డు పిన్ నంబర్ బ్యాంకులో ఎంటర్ చేయాలంటూ లోనికి వెళ్లి స్వైప్ మిషన్ ద్వారా రూ.9 వేలు తన ఖాతాకు జమ చేసుకుని కార్డు ఇచ్చేశాడు. గురువారం నగదు అవసరమైన శంకర్‌రావు అదే ఏటీఎంకు రాగా, ఖాతాల్లో డబ్బు లేనట్లు గుర్తించాడు. వెంటనే సదరు ఉద్యోగిని గట్టిగా మందలించడంతో తప్పు ఒప్పుకుని తిరిగి రూ.9 వేలు ఇచ్చేశాడు. కాగా, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని బ్యాంక్ మేనేజర్ తెలిపారు.

బీసీ బంధులో రగడ





చెక్కుల పంపిణీ కార్యక్రమంలో విప్ రేగా, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే పొదెం వీరయ్య (ఇన్‌సెట్) రేగా మైక్ తీసుకుంటుండగా అడ్డుకుంటున్న ఎమ్మెల్యే

- విప్ రేగా, ఎమ్మెల్యే పొదెం మధ్య వాగ్వాదం
- ఉత్కంఠకు దారితీసిన రుణాల పంపిణీ

భద్రాచలం: బీసీ రుణాల పంపిణీ కార్యక్రమం భద్రాచలంలో రసాభసాగా మారింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల కేకలు, వాగ్వాదాలతో సబ్‌కలెక్టరేట్ దద్దరిల్లింది. నియోజకవర్గ పరిధిలోని భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల బీసీ లబ్ధిదారులకు స్థానిక సబ్ కలెక్టరేట్‌లో గురువారం రుణాల చెక్కులు పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే పొదెం వీరయ్య, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్సీ తాతా మధు హాజరు కాగా, మొదట ఎమ్మెల్యే వీరయ్య మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీసీ రుణాల లబ్ధిదారుల జాబితాను తన ప్రమేయం లేకుండా ప్రకటించటం విడ్డూరంగా ఉందన్నారు. అధికార పార్టీల ఎమ్మెల్యేలు ఉన్న చోట వారి కనుసన్నల్లో పంపిణీ చేశారని, భద్రాచలానికి వచ్చే సరికి ఆ ప్రొటోకాల్‌ను విస్మరించడం సరైంది కాదని అన్నారు. అధికార పార్టీ నాయకులు కావాలనే వివక్ష చూపుతున్నారని విమర్శించారు. అనంతరం విప్ రేగా కాంతారావు మైక్ అందుకునే ప్రయత్నం చేయగా వీరయ్య నిలువరించారు. ఇది ప్రభుత్వ కార్యక్రమమని, పార్టీది కాదని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరగగా, ఇరు పార్టీల కార్యకర్తలు కేకలతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఎమ్మెల్సీ తాతా మధు వారించినా ఎవరూ తగ్గలేదు. అర్ధగంట తర్వాత పోలీసులు ఇరు పార్టీల కార్యకర్తలను బయటికి తీసుకెళ్లడంతో గొడవ సద్దుమణిగింది. అనంతరం కొందరికి చెక్కులు అందజేశాక ఎమ్మెల్యే వీరయ్య వెళ్లిపోవడంతో మిగిలిన వారికి అధికార పార్టీ నాయకులు పంపిణీ చేశారు.

కుల వృత్తులకు పెద్దపీట : విప్ రేగా

చెక్కుల పంపిణీ అనంతరం విప్ రేగా కాంతారావు విలేకరులతో మాట్లాడుతూ.. భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం మండలాలకు చెందిన 170 మంది బీసీ కుల వృత్తిదారులకు రూ.1.70 కోట్ల విలువైన చెక్కులు పంపిణీ చేశామని చెప్పారు. కుల వృత్తిదారులను ఆదుకున్న ప్రభుత్వం కేసీఆర్‌దేనని అన్నారు. అర్హులందరికీ దశల వారీగా రుణాలు అందిస్తామని తెలిపారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో అభివృద్ధిని చూసి తట్టుకోలేని కాంగ్రెస్ నాయకులు అవాకులు చెవాకులు పేలుతున్నారని ఆరోపించారు. భద్రాచలంలో కరకట్ట సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం నిపుణుల కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో తెల్లం వెంకట్రావును గెలిపిస్తే భద్రాచలం నియోజకవర్గం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

ఎన్నికలొస్తేనే గుర్తొస్తుందా : పొదెం

ఎన్నికలు సమీపిస్తే కానీ రాష్ట్ర ప్రభుత్వానికి, నాయకులకు భద్రాచలం గుర్తుకు రాదని ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఎద్దేవా చేశారు. గురువారం ఆయన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ కార్యక్రమాలను పార్టీ కార్యక్రమాలుగా మారుస్తూ ప్రజలను వంచిస్తున్నారని ఆరోపించారు. భద్రాచలం అభివృద్ధి అంటూ ఇప్పుడు హామీలు గుప్పిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నా ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ నుంచి గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరిన రేగా కాంతారావుకు ఇప్పుడు మాటలు చెప్పే అర్హత లేదని విమర్శించారు. భద్రాచలానికి కేసీఆర్ ఇప్పటివరకు చేసింది శూన్యమని, ఇప్పుడు చేస్తున్నది ఎన్నికల స్టంట్‌గానే ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కు తగిన సమాధానం చెబుతారని అన్నారు.

'సంక్షేమాన్ని' ఎప్పుడూ ఆపలేదు

- పేదలకు కేసీఆరే శ్రీరామరక్ష
- రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- దివ్యాంగులకు పెరిగిన పెన్షన్ పత్రాల పంపిణీ
- పలు అభివృద్ధి కార్యక్రమాలకూ శంకుస్థాపన



కలెక్టరేట్‌లో పత్రాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పక్కన కలెక్టర్ ప్రియాంక ఆల, ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, హరిప్రియ తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కరోనా వంటి విపత్కర సమయంలో అందరి ఆదాయం పడిపోయినా, ప్రజాప్రతినిధులు, ఉద్యోగుల వేతనాలు ఆగినా పేదలకు అందించే సంక్షేమ పథకాలు మాత్రం ఆపలేదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన జేపీఎస్‌ల క్రమబద్ధీకరణ, కారుణ్య నియామకాలు, ఇంటిస్థలాలు, పట్టాలు, దివ్యాంగులకు పెంచిన పెన్షన్ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. పెన్షన్ పెంపుతో జిల్లాలో 13,770 మంది దివ్యాంగులు లబ్ధిపొందుతారని చెప్పారు. ఏరాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని తెలిపారు. ఇతర ఆసరా పెన్షన్లను కూడా పెంచే అవకాశం ఉందని ప్రకటించారు. రైతులకు రూ. 36వేల కోట్లు రుణమాఫీ చేశామని, ప్రతి సంవత్సరం రూ.75 వేల కోట్ల మేర రైతుబంధు పంపిణీ చేసున్నామని వివరించారు. రైతులకు 24 గంటలు విద్యుత్ ఇస్తుంటే ఓ మహానుభావుడు 3 గంటలు చాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు అమలు చేస్తున్న సీఎం కేసీఆరే పేదలకు శ్రీరామరక్ష అన్నారు. తెలంగాణలో అభివృద్ధి చూసి విమర్శకులు బెంబేలెత్తుతున్నారని అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో గురువారం రూ. 145 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. గోదావరి వరదల సమయంలో ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టిన కలెక్టర్ ప్రియాంక ఆలను సన్మానించారు. ఎమ్మెల్యే వనమాను సైతం సత్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 481 గ్రామపంచాయతీల్లో 349 జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తున్నారని, వారిలో 261 మందికి నాలుగేళ్ల సర్వీస్ పూర్తి కాగా, ఎవాల్యుయేషన్ పూర్తి చేసిన 100 మందిని క్రమబద్ధీకరించనట్లు తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ మరణించిన 26 మంది కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక పత్రాలు అందించామని తెలిపారు. జీఓ 58 ద్వారా క్రమబద్ధీకరణ పట్టాలు, ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న ఎస్సీలు 37 మందికి పట్టాలు జారీ చేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సింగరేణి(కొత్తగూడెం)/పాల్వంచ: కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో రూ. 135.25 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో వివిధ అభివృద్ధి పనుల పైలాన్‌ను ఆవిష్కరించారు. రామవరంలో రూ.కోటితో నిర్మించే మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌కు భూమిపూజ చేశారు. పాల్వంచ నవభారత్ సెంటర్‌లో రూ.60 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటు తర్వాతే కొత్తగూడెంలో కొత్తదనం వచ్చిందని అన్నారు. పట్టణంలో మెడికల్ కళాశాల, నూతన కలెక్టరేట్, మాతాశిశు ఆస్పత్రి, పోలీస్ బెటాలియన్, ఇతర జిల్లా కార్యాలయాలతో కళకళలాడుతోందని చెప్పారు. పట్టణ అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సీఎం కేసీఆర్‌ను ఒప్పించి రూ.75 కోట్లు మంజూరు చేయించుకున్నారని తెలిపారు. ఆయన ఎమ్మెల్యేగా ఉండడం కొత్తగూడెం ప్రజలకు వరమన్నారు. కొత్తగూడెం, పాల్వంచ ఇప్పటికే పారిశ్రామికంగా అభివృద్ధిలో ఉన్నాయని, రాబోయే రోజుల్లో ఈ రెండు పట్టణాలు హైదరాబాద్, సికింద్రాబాద్ కంటే గొప్పగా విరజిల్లాలంటే వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి పట్టం కట్టాలని, కొత్తగూడెంలో వనమాను గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో కొత్తగూడెం, ఇల్లెందు ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, బానోత్ హరిప్రియ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేందర్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, జెడ్పీ వైస్‌చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, కొత్తగూడెం, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్లు కాపు సీతాలక్ష్మి, డి.వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఎంపీపీలు బాదావత్ శాంతి, మడివి సరస్వతి, జెడ్పీటీసీ వాసుదేవరావు, మార్కెట్ చైర్మన్ భూక్యా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



రామవరంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి పువ్వాడ

క్లుప్తంగా

నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారి

ఇల్లెందు: పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి నకిలీ ధ్రువపత్రాలు సమర్పించి ఉద్యోగంలో చేరినట్లు శాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. ఈమేరకు గురువారం ఇల్లెందు పీఆర్ డీఈ ఆర్.రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇల్లెందుకు చెందిన ప్రభాకర్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా 12 ఏళ్ల క్రితం ఉద్యోగంలో చేరినప్పుడు ధ్రువపత్రాలు అందజేశారు. ఇటీవల రెగ్యులరైజేషన్ కోసం ఆయన ధ్రువపత్రాలు పరిశీలించగా నకిలీవని తేలింది. దీంతో డీఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

ట్యాంకర్ టైరు పేలి..

హైడ్రోజన్ పెరాక్సైడ్ లీక్

అశ్వారావుపేటరూరల్: ఓ లారీ ట్యాంకర్‌లో తరలిస్తున్న హైడ్రోజన్ పెరాక్సైడ్ లీకైన ఘటన గురువారం అశ్వారావుపేటలో జరిగింది. స్థానికులు, అగ్నిమాపక శాఖ అధికారుల కథనం ప్రకారం.. హరియాణా రాష్ట్రం నుంచి ఓ లారీ ట్యాంకర్‌లో హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను ఏపీలోని విశాఖపట్నానికి తరలిస్తున్నారు. ఈ క్రమంలో అశ్వారావుపేట వద్దకు రాగానే ట్యాంకర్ వెనుక టైరు పేలిపోయింది. పేలుడు ధాటికి ట్యాంకరు పైపు ధ్వంసం కాగా, హైడ్రోజన్ పెరాక్సైడ్ లీకై బయటకు వచ్చింది. డ్రైవరు అప్రమత్తమై లారీని నిలిపివేశాడు. స్థానికుల సమాచారంతో వచ్చిన అగ్నిమాపక శాఖ అధికారులు ట్యాంకర్‌ను గ్రామ శివారుకు తరలించారు. హైడ్రోజన్ పెరాక్సైడ్ లీకవగానే నురుగలు, పొగలు రావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


గోపాలస్వామి (ఫైల్)

టేకులపల్లి: చికిత్స పొందుతున్న వ్యక్తి గురువారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 12న కొత్తగుండ్లమడుగు సమీపంలో కారు, ఆటో ఢీకొని ఆరుగురు గాయపడ్డారు. వారిలో తీవ్రంగా గాయపడ్డ, చింతోనిచెలక గ్రామానికి చెందిన ఈసం గోపాలస్వామి(57) ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ రమణారెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,091

వరలక్ష్మీ వ్రతంతో సకల శుభాలు

- అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం
- నేడు వేడుకకు సిద్ధమైన మహిళామణులు
- పూజా సామగ్రికి పెరిగిన ధరలు

కొత్తగూడెంటౌన్/పాల్వంచ రూరల్: శ్రావణ మాసం వ్రతాలు, పూజలు, పండుగలకు ప్రత్యేకం. ఈ మాసంలో పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం రోజు మహిళలు వరలక్ష్మీవ్రతాన్ని ప్రత్యేకంగా జరుపుతారు. ఈ రోజున వీలుకాకపోతే శ్రావణ మాసంలోని ఏ శుక్రవారమైనా వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించవచ్చని పండితులు చెబుతున్నారు. దీర్ఘకాలం సుమంగళిగా ఉండాలని వివాహితలు, మంచి భర్త లభించాలని యువతులు వ్రతం ఆచరిస్తారు. అష్టైశ్వర్యాలైన సంపద, భూమి, శిక్షణ, ప్రేమ, కీర్తి, శాంతి, సంతోషం, శక్తి వంటివి కూడా లభిస్తాయని భక్తులు విశ్వసిస్తా రు. నేడు శుక్రవారం కావడంతో మహిళలు వ్రతానికి సిద్ధమవుతున్నారు. ఇళ్లను శుభ్రం చేసుకుంటున్నారు. కొందరు రంగులు వేసుకుంటున్నారు.

పూలు, పండ్లకు గిరాకీ..

వ్రతానికి అవసరమైన పసుపు, కుంకుమ, గంధం, పూలు, మామిడాకులు, అరటిపండ్లు, అమ్మవారి ఫొటో, కలశం, కొబ్బరి కాయలు, తమలపాకులు, వక్కలు తెల్ల టవలు, బ్లౌజ్ పీసులు, తెల్ల దారం, పంచామృతం, ఇతర పూజా వస్తువులు సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో పూలకు, పండ్లకు, కొబ్బరి కాయలకు గిరాకీ పెరిగింది. కిలో పూలు రూ. 400 వరకు పలుకుతుండగా, సాధారణ దండలైతే మూర రూ. 30, పెద్ద దండలైతే రూ.300కు పైగా పలుకుతోంది. హైదరాబాద్, బెంగళూరుల నుంచి పూలు తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. కొబ్బరి కాయ ధర రూ. 20 నుంచి రూ. 30కు పెరిగింది. రూ. 50 డజనుగా ఉన్న అరటి పండ్ల ధర రూ. 70కు చేరింది. ఇళ్లకు వచ్చి వ్రతాలను చేసే పూజారులకు కూడా డిమాండ్ పెరిగింది.



పాల్వంచలో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు, (ఇన్‌సెట్) అమ్మవారి ప్రతిమలు

ఇళ్లు, ఆలయాల్లో..

ఇళ్లతోపాటు ఆలయాల్లోనూ వరలక్ష్మీవ్రతం నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయాల్లో నిర్వాహకులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా కేంద్రం కొత్తగూడెంతోపాటు పాల్వంచ, ఇల్లెందు, భద్రాచలం, అశ్వారావుపేట, మణుగూరు తదితర ప్రాంతాల్లో అమ్మవారి ఆలయాలను ముస్తాబు చేశారు.

అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయి



వరలక్ష్మీ వ్రతం చేసిన స్త్రీలకు సౌభాగ్యం సిద్ధిస్తుంది. అష్టైశ్వర్యాలు లభిస్తాయి. శ్రావణమాసంలో పూజలు చేస్తే ఆయురారోగ్యాలు పొందుతారు. వ్రతం పాటించిన మహిళలకు మాంగళ్యబలంతోపాటు బంధువులతో ఆనందంగా ఉంటారని నమ్మకం.

– కొండవీటి దత్తాత్రేయశర్మ, అర్చకుడు, కొత్తగూడెం

సింగరేణి ప్రధానాస్పత్రిలో నూతన భవనాలు

సిటీ, ఎంఆర్ఐ స్కాన్ బ్లాక్‌లకు శంకుస్థాపన

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రిలో నూతన భవనాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా సీటీ, ఎంఆర్ఐ బ్లాక్‌లకు గురువారం డైరెక్టర్(పా) ఎన్.బలరామ్ గురువారం భూమి పూజ చేసి మాట్లాడారు. ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఎప్పటికప్పుడు నూతన విభాగాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే సీటీ, ఎంఆర్ఐ స్కాన్ త్వరలో అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఈ స్కానింగ్‌ల కోసం బయటి ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తుండడంతో సింగరేణి ఆస్పత్రిలోనే భవనాలు నిర్మించి యంత్రాలు సమకూరుస్తామని తెలిపారు. ఈ అధికారులు బీ.వీ.రావు, సూర్యనారాయణ, బీ.ఆర్.దీక్షితులు, సుజాత, విక్టర్ వందనం, వరప్రసాద్‌రావు, రాజశేఖర్, రాజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఆస్పత్రిలో నూతన బ్లాక్‌ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న డైరెక్టర్ బలరామ్

పీఐబీ ఆధ్వర్యాన వర్క్‌షాప్

సింగరేణి అభివృద్ధిలో పాత్రికేయుల పాత్ర మరువలేనిదని డైరెక్టర్(పా) ఎన్.బలరామ్ తెలిపారు. కొత్తగూడెంలోని ఇల్లెందు క్లబ్‌లో గురువారం ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) ఆధ్వర్యాన నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లటంలో విశేష కృషి చేస్తున్న పాత్రికేయుల వృత్తి నైపుణ్యాలు మెరుగుపరిచేలా వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్న పీఐబీ బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పీఐబీ జాయింట్ డైరెక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ జర్నలిస్టులు నైతిక విలువలు పాటిస్తూ కచ్చితమైన సమాచారాన్ని ప్రజలకు అందజేయాలని, ముందుగా నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. కొత్తగూడెం డీఆర్‌ఓ రవీంద్రనాథ్, సీడాక్ సైంటిస్ట్ జగదీష్‌తో పాటు కోటేశ్వరరావు, శివచరణ్‌రెడ్డి, ఉమామహేశ్వరరావు, కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

13 కిలోల గంజాయి స్వాధీనం

ఇల్లెందు: కారులో అక్రమంగా తరలిస్తున్న 13.5 కేజీల గంజాయిని మండలంలోని బొజ్జాయిగూడెం సమ్మక్క గద్దెల వద్ద ఖమ్మం ఎక్సైజ్ అధికారులు గురువారం పట్టుకున్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన నిందితులు ధీరజ్ తివారీ, జితేంద్ర చంద్ర వంశీలను అరెస్ట్ చేశారు. గంజాయి విలువ రూ.2.5 లక్షలు ఉంటుందని, విశాఖపట్నం నుంచి భోపాల్‌కు తరలిస్తున్నట్లు విచారణలో తేలిందని ఎక్సైజ్ ఏఈఎస్ కె. తిరుపతి, సీఐ సర్వేశ్వరరావు తెలిపారు. ఎస్ఐలు ముబషీర్ అహ్మద్, కరీం పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

రాముల వారికి హీరో గ్లామర్!


ఆలయ ఈఓకు వాహనం అందజేస్తున్న షోరూం నిర్వాహకులు

హీరో కంపెనీ బీఎస్‌ఈ గ్లామర్ వాహనాన్ని మళ్లీ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు భద్రాచలంలోని శ్రీరాం హీరో షోరూంలో నిర్వాహకులు భరత్, డిప్యూటీ జోనల్ మేనేజర్ లక్ష్మీషా, తెలంగాణ ఏరియా మేనేజర్ మనీష్‌జైన్‌తో పాటు వినీత్, కరణ్ గురువారం వివరాలు వెల్లడించారు. వినియోగదారుల కోరిక మేరకు గ్లామర్ వాహనాన్ని మరిన్ని హంగులతో మార్కెట్‌లోకి తీసుకొచ్చామని తెలిపారు. కాగా, తొలి వాహనాన్ని భద్రాద్రి శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయానికి బహూకరించారు. ఈ మేరకు వాహనం తాళాలను దేవస్థానం ఈఓ. ఎల్.రమాదేవికి అందజేశారు.

– భద్రాచలంఅర్బన్

జేపీఎస్‌ల్లో హర్షాతిరేకాలు

- జిల్లాలో 100 మందికి రెగ్యులరైజేషన్
- నియామక పత్రాలు అందించిన మంత్రి పువ్వాడ
- సర్వీసు వర్తింపుపై స్పష్టతలేక ఒకింత ఆందోళన

చుంచుపల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శు(జేపీఎస్)ల ఆశలు నెరవేరాయి. జిల్లాలో 100 మంది ఉద్యోగాలను రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ ప్రియాంక ఆల గురువారం వారికి నియామక పత్రాలను అందజేశారు. 2019, ఏప్రిల్ 12న జేపీఎస్‌లను ప్రభుత్వం నియమించింది. మొదట వీరిని మూడేళ్లపాటు, తర్వాత ఏడాది.. మొత్తం నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలం నిర్దేశించగా, ఈ ఏడాది ఏప్రిల్ 12తో ఆ గడువు పూర్తైంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నాలుగేళ్లు సర్వీసు పూర్తిచేసిన వారిని రెగ్యులరైజ్ చేశారు. తొలుత రూ.15 వేల వేతనం ఇవ్వగా, ప్రస్తుతం రూ. 28,700 చెల్లిస్తున్నారు. జిల్లాలో 350 జేపీఎస్‌లు ఉండగా, 260 మంది నాలుగేళ్ల సర్వీసు కాలాన్ని పూర్తి చేసుకున్నారు. వీరిలో 100 మందికే కార్యదర్శుల అనుభవం, పనితీరును వెరిఫికేషన్ ఆధారంగా క్రమబద్ధీకరించారు. మిగిలిన అభ్యర్థులకు మరో వారం, పది రోజుల్లో రెగ్యులరైజ్ చేస్తామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు తెలిపారు.


నియామక పత్రాలు అందిస్తున్న మంత్రి అజయ్, కలెక్టర్ ప్రియాంక, ఎమ్మెల్యేలు హరిప్రియ, వనమా

సర్వీసు వర్తింపుపై గందరగోళం

జేపీఎస్‌ల క్రమబద్ధీకరణలో అనుభవం, పనితీరును బట్టి అధికారులు మార్కులు కేటాయిస్తున్నారు. మొత్తం 100 మార్కులు నిర్దేశించగా, గ్రామాల్లో రోడ్లు, మురుగు కాలువల శుభ్రం, దోమల నివారణ చర్యలు, పంచాయతీల రికార్డులు, డంపింగ్ యార్డు, వర్మీ కంపోస్టు తయారీ, వైకుంఠధామం నిర్వహణ, పన్నుల వసూలు, మొక్కల పెంపకం, క్రీడా ప్రాంగణ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి మార్కులు ఇస్తున్నారు. 70 అంతకంటే ఎక్కువ మార్కులు వచ్చిన వారిని రెగ్యులరైజ్ చేస్తున్నారు. వారందరినీ గ్రేడ్–4 పంచాయతీ కార్యదర్శులుగా గుర్తిస్తూ నియామక పత్రాలు అందజేస్తున్నారు. అయితే వీరికి సర్వీసు ఎప్పటి నుంచి వర్తిస్తుందో అనేది నియామక పత్రాల్లో పేర్కొనకపోవడంతో కొంత గందరగోళం నెలకొంది. దీనిపై ఉన్నతాధికారులు కూడా స్పష్టత ఇవ్వడం లేదు.

చాలా సంతోషంగా ఉంది



నాలుగేళ్లుగా పనిచేస్తున్న జేపీఎస్‌లను రెగ్యులర్ చేయడం చాలా సంతోషం. ఉద్యోగ భద్రత లేదనే ఇంత కాలం బాధ పడుతున్నాం. ప్రభుత్వం నియామక పత్రాలు అందజేయడంతో మాకు కొండత ధైర్యం వచ్చింది. –నిడిగొండ రాధిక, జేపీఎస్

స్వప్నం నెరవేరింది



జేపీఎస్‌లను గ్రేడ్–4 పంచాయతీ కార్యదర్శులుగా అవకాశం కల్పించడంతో మా కల నెరవేరింది. కొంత ఆలస్యంగానైనా రాష్ట్రప్రభుత్వం మాకు న్యాయం చేసింది. మరింత పట్టుదలతో గ్రామాలను ప్రగతిపథంలో నడిపిస్తాం. –రణధీర్‌రెడ్డి, జేపీఎస్

ఆటో, బైక్ ఢీ

ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు

దుమ్ముగూడెం : బైక్, ఆటో ఢీకొని ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని నర్సాపురం గ్రామ శివారులో గురువారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాపురం గ్రామానికి చెందిన ఝాన్సీ(57) మరో ఇద్దరు గ్రామస్తులతో కలిసి శ్రావణ శుక్రవారం పూజకు కావాల్సిన సామగ్రి కొనుగోలుకు ఆటోలో భద్రాచలం వెళ్తున్నారు. అదే సమయంలో సీతారాంపురం గ్రామానికి చెందిన యువకులు మధుసూదన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి భద్రాచలం నుంచి సీతారాంపురం బైక్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో నర్సాపురం శివారులో రోడ్డుపై ఉన్న గుంతలను తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం, ఆటో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఆటో అదుపు తప్పి పల్టీ కొట్టడంతో ఝాన్సీకి తీవ్ర గాయాలపై అక్కడికక్కడే మృతి చెందింది. బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ కేశవరావు సందర్శించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భూవివాదంలో నలుగురిపై కేసు

పాల్వంచ: పాల్వంచ పట్టణంలోని బసవ తారక కాలనీ సమీపంలో ఓ ఇంటి నిర్మాణాన్ని జేసీబీతో కూల్చివేసిన ఘటనలో నలుగురిపై పోలీసులు గురువారం కేసులు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కొండపల్లి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి బసవ తారక కాలనీలో గతంలో ప్లాట్ కొనుగోలు చేశారు. ఈ స్థలంలో ఇటీవల గది నిర్మాణం చేసుకున్నారు. కాగా కనగాల బాలకృష్ణ, కాంపెల్లి కనకేశ్, చింతా నాగరాజు, గంధం భాస్కర్, మరికొందరు బుధవారం జేసీబీతో ఇంటిని దౌర్జన్యంగా కూల్చివేశారు. తమపై దాడి కూడా చేశారని వెంకటేశ్వర్లు భార్య భారతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ బి.రాము తెలిపారు.

కేసీఆర్, మోదీవి పగటి కలలే..

కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి


గుండాల: రాష్ట్రంలో కేసీఆర్, దేశంలో మోదీ మళ్లీ రాజ్యమేలేందుకు పగటి కలలు కంటున్నారని, ఇక ఆ సినిమా లేదని కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి పేర్కొన్నారు. మండలంలో రెండు రోజులపాటు పర్యటించిన ఆమె గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల సమయంలో పోలీసుల వాహనాల్లో డబ్బులు పంచారని, పోలీసులను తమ ఇళ్లలో బానిసలుగా చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలతో ప్రజలు విసిగిపోయారని, ప్రజల కోసం ఏం చేశారని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. ఇటీవల కురిసిన వానలకు నష్టపోయిన రైతులను మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు పరామర్శించలేదని నిలదీశారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర అడిగితే అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు. రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం వద్ద పైసలు లేవుకాని, ఎమ్మెల్యేలను కొనడానికి మాత్రం కోట్ల రూపాయలు వస్తాయని విమర్శించారు. ధరణి పేరుతో నిరుపేదల నుంచి భూములు లాక్కున్న చరిత్ర కేసీఆర్‌ది అని అన్నారు. తాను ఖమ్మం జిల్లాలో ఉంటానని, ప్రజాస్వామ్య విధానాలను కౌగిలించుకుని కత్తుల లాంటి కార్యకర్తలతో కాంగ్రెస్‌ను అభిమానించే ఓటర్లతో బీఆర్ఎస్, బీజేపీలను లేకుండా చేస్తామని సవాల్ విసిరారు. తొలత జగ్గాయిగూడెంలో రైతులతో కలిసి ట్రాక్టర్ నడిపి, కూలీలతో కలిసి వరి నాటు వేశారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరావు పార్టీ మారుతారనే ప్రచారం జరుగుతోందని, తమ పార్టీలోకి వస్తే ఆహ్వానిస్తామని తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ గంగా నది లాంటిదని నిరంతరం పారుతూనే ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు బట్టా విజయ్‌గాంధీ, మంజుల, ఎంపీటీసీ కల్తి కృష్ణారావు, కొడెం ముత్యమాచారి, పొంబోయిన ముత్తయ్య, ఈసం పాపారావు, రమేష్, శ్వేత సమ్మయ్య, ప్రవీణ్, చలపతి, జోగయ్య, కృష్ణ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రేణుకాచౌదరి

ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం

పరిస్థితి ఉద్రిక్తం.. బాధితులు, పోలీసులకు వాగ్వాదం

చర్ల: ప్రభుత్వ భూమిలో గోదావరి ముంపు బాధితులు గుడిసెలు వేయడంతో ఉద్రిక్తత నెలకొంది. ఏటా వరదలతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం ఎత్తైన ప్రదేశాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వడం లేదని పేర్కొంటూ చర్లలోని సర్వే నంబర్ 117 భూమిలో గురువారం పలువురు గుడిసెలు వేశారు. కాగా సదరు స్థలం సీఆర్పీఎఫ్ బెటాలియన్ ఏర్పాటుకు 2021లో రెవెన్యూ శాఖ పోలీస్ శాఖకు కేటాయించిందని పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. భారీగా చేరుకున్న సీఆర్పీఎఫ్ జవాన్లు, స్పెషల్ పార్టీ పోలీసులు ఆందోళనకారులను అక్కడి నుంచే ఖాళీ చేయించే ప్రయత్నం చేశారు. దీంతో ఇరువర్గాల మధ తీవ్ర వాగ్వాదం నెలకొంది. కొందరు సీఆర్పీఎఫ్ జవాన్లు మహిళలను నెట్టివేయడంతో తేగడకు చెందిన నాగమణి స్పృహ తప్పి పడిపోయింది. బాధితుల పక్షాన నిలిచిన సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మండల కార్యదర్శి కొండా చరణ్, గోదావరి ముంపు ప్రాంతాల బాధితుల పోరాట సంఘం అధ్యక్షుడు బోడా సందీప్, కార్యదర్శి కొండా కౌశిక్ తదితరులను పోలీసులు అడ్డుకున్నారు. ఓ దశలో లాఠీ చార్జీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఓ సీఆర్‌పీఎఫ్ జవాన్ అత్యుత్సాహంతో ఓ విలేకరిపై చిందులు తొక్కగా, సీఐలు రాజగోపాల్, అశోక్‌లు అతన్ని మందలించారు. అనంతరం సీఐ రాజగోపాల్ నచ్చజెప్పడంతో ఆందోళనకారులు శాంతించారు.


పోలీసులతో వాగ్వాదానికి దిగిన ముంపు ప్రాంత బాధితులు